డా. నోముల సత్యనారాయణ కథా పురస్కారం 2016 పొందిన కథ

# ఫీనిక్స్

"లహరీ!..."

"నేనేనండీ. ఎక్కడున్నారు ఎలా ఉన్నారు ఎప్పుడొస్తున్నారు?" ఆదుర్దాగా అడిగాను.

"లొకేషన్ సెలక్షన్‌కి వచ్చానని చెప్పేగా. మళ్ళీ అడుగుతావేంటి?"

"అదికాదండీ పిల్లలు అడుగుతున్నారు..." నసిగాను.

"సర్లే. చెప్పేది విను. ఈవెనింగ్ మన ప్రొడక్షన్ మేనేజర్ రాందాసు కొడుకు ఫస్ట్ బర్త్‌డే. లేక లేక పుట్టాడని గ్రాండ్‌గా చేస్తున్నాట్టలే. నాకు రావటం కుదరదు గాని నువ్వు పిల్లల్ని తీసుకునెళ్ళు. శంకరం గిఫ్టు కొని తెచ్చిస్తాడులే..."

"మీరు తోడులేకుండా ఒక్కద్దాన్నీ ఎలా వెళ్ళగలనండీ... ఎప్పుడూ ఎక్కడికీ వెళ్ళలేదు...!"

"నిన్ను కాకెత్తుకు పోదులే. డ్రైవరుంటాడుగా వెళ్ళు. ఎవరం వెళ్ళకపోతే బాధపడతాడు..."

నాకు మరి అవకాశం ఇవ్వకుండా లైన్ కట్ చేశారు మావారు వాలేశ్వర్రావు. ఆయన ప్రముఖ సినీ నిర్మాత.

సంగతి తెలీగానే పిల్లల ముఖాలు వాడిపోయాయి. తండ్రితో కలిసి పార్టీలకీ ఫంక్షన్లకీ వెళ్ళాలని ఎంతో ఉబలాటపడుతుంటారు. ఎప్పుడో గాని తీసుకెళ్ళరాయన. టూర్లూ సిట్టింగులూ షూటింగులూ రిలీజులూ కలెక్షన్లూ తప్ప కుటుంబం పట్టనే పట్టదు!

పిల్లల్ని మాటల్లో పెట్టి మరిపించి బర్త్‌డే పార్టీకి తీసుకెళ్ళాను.

స్టార్ హెూటల్లో ఏర్పాటు చేశాడు రాందాసు. ఎంట్రన్సులోనూ హాలులోనూ స్టేజి వెనుకా రకరకాల బుడగలతో చక్కని అలంకరణ చేసారు.

నాకెందుకో చిన్నప్పట్నుంచీ బుడగలంటే ప్రత్యేక ఇష్టం. తీర్థాలకి వెళితే జేబులో ఉన్న డబ్బంతా పెట్టి బుడగలు కొనేదాన్ని. వాటితో ఆడుకోవడం, పొడుగు బుడగల్ని పాములా మెడలో వేసుకోవడం, పడుకునేప్పుడు కూడా ప్రక్కనే పెట్టకోవడం, అవి పేలితే ఏడవడం – బాల్య చేష్టలు చిత్రమైనవి సుమా!

"ఇదెక్కడి పిచ్చే. క్షణాల్లో పేలే బుడగల మీద అంత ఆపేక్ష పనికి రాదు" అని మందలించేది నానమ్మ.

ఆ ఊసులు గుర్తొచ్చి నవ్వుకుంటూ లోపలి కెళ్ళాం. అతిథులంతా సినిమా జనాలే.

ఎవరెవరో వచ్చి విష్ చేశారు. రాందాసు దంపతులు ఎదురొచ్చి ఆహ్వానించారు. ముందు వరుసలో కూర్చోబెట్టి వెల్కం డ్రింకు ఇప్పించారు.

బాలు, నీలు గబగబా పుచ్చకాయ జ్యూస్ త్రాగేసి వెళ్ళి స్టేజి మీద కుప్పలా పోసిన బుడగల్తో ఆడుకోసాగారు.

"సార్ తప్పకుండా వస్తారనుకున్నాను..." కొందరు ఆడవాళ్ళని నాకు పరిచయం చేశాక నొచ్చుకుంటూ అన్నాడు రాందాసు.

"లొకేషన్ సెలక్షన్ అవ్వలేదుట. లేకపోతే రాకుండా ఉండరు. మనింటి ఫంక్షన్ కదా!"

ఆడవాళ్ళు మొఖా మొఖాలు చూసుకుని నవ్వుకున్నారు.

"ఊర్వశి కూడా వెళ్ళిందనుకుంట కదా" ఒకావిడ అమాయకంగా అడిగినట్లు అడిగింది.

నా మొహం అడ్డంగా కోసిన కందగడ్డ అయ్యింది.

"ఇద్దరూ కలిసి లొకేషన్లు సెలక్టు చేస్తారేమో, మనకెందుకులే" అని అదోలా నవ్వింది రెండో ఆమె.

మరి నిలబడే శక్తి లేనట్టు నిస్త్రాణగా కుర్చీలో కూలబడ్డాను.

వీళ్ళన్నది నిజమేనా? ఆయన యూరప్ ట్రిప్‌కి సినీనటి ఊర్వశిని వెంట తీసుకెళ్ళారా? ఇద్దరూ పది పదిహేను రోజుల్నుంచి జంటగా...!

కాళ్ళక్రింది భూమి కంపించింది. కళ్ళల్లోని కన్నీళ్ళు చెలియలికట్ట దాటాయి.

ఫంక్షన్లో గాక మరెక్కడున్నా బావురుమనే దాన్నే. గుండెలు పగిలేలా ఏడ్చేదాన్నే.

పళ్ళ బిగువున కన్నీటిని అదిమి పట్టాలని గట్టిగా ప్రయత్నించాను. అయినా ఒకటీ అరా బొట్టు బొట్టుగా జారుతూనే ఉన్నాయి.

ఆయన శ్రీరామచంద్రుడు కాదని తెలుసు. సినీమాయారంగంలో ఇలాంటివి మామూలేనని సరిపెట్టుకుంటూ వస్తున్నాను. కానిప్పుడు అగ్నిసాక్షిగా పెళ్లాడిన భార్యనీ ఆరు ఎనిమిదేళ్ళ పిల్లల్నీ వదలి ఒక వగలాడితో 'విహారయాత్ర' కెళ్ళడం...!

మరి నిగ్రహించుకోలేక గబగబా రెస్ట్‌రూంలో కెళ్ళి తనివి తీరా ఏడ్చాను. గుండె భారం కొంచెంగా తగ్గింది. తిరిగి హాల్లో కొచ్చాను. ఎన్నో కళ్ళు నన్ను సానుభూతిగా, వెకిలిగా, రకరకాల హావభావాలతో గుచ్చి గుచ్చి చూస్తున్న అనుభూతి కలిగింది. అవమానంగా అన్పించింది.

అక్కడ ఉండబుద్ధి కాలేదు. కాని కేక్ కట్ చెయ్యకుండా ఎలా వెళ్ళటం ?

పిల్లలు నా కోసం వెదుకుతూ వచ్చారు. నేను కనబడక పోయేసరికి భయపడినట్లున్నారు. వాళ్ళని దగ్గరకి తీసుకున్నాను. నిశ్చింతగా ఫీలయ్యారు.

"మమ్మీ – నాకది కావాలి..." ఒకమ్మాయి నెత్తిమీద పెట్టుకున్న 'బుడగ కిరీటాన్ని'

చూపిస్తూ అడిగింది నీలు.

నాకూ ముచ్చటగా అన్పించింది.

పిల్లల్ని తీసుకుని బుడగలతని దగ్గరికెళ్ళాను. పొడుగాటి బుడగని కిరీటంలా చేసి పిల్లల తల మీద పెడుతున్నాడు.

"చాలా బావుంది. మా పిల్లలకి పెట్టు..." అన్నాను.

ఇంతలో రాందాసు, "ఇక్కడున్నారా మేడమ్..." అంటూ పరుగునొచ్చాడు. "మా సార్ పిల్లలకి స్పెషల్‌గా చేసియ్యి" అని అతడితో చెప్పి, "మీరు రండి మేడమ్ కేక్ కట్ చేయిద్దాం" అని ఆహ్వానించాడు.

"మీరు రెడీ చేస్తూండండి వచ్చేస్తాను..."

రెండు పొడుగాటి బుడగలతో కిరీటంలా చేసి పిల్లల నెత్తి మీద పెట్టాడు. ఏనుగెక్కినట్టు సంబరపడ్డారు పిల్లలు.

అతడ్ని అభినందించి స్టేజి మీద కెళ్ళాను.

కేక్ కటింగ్ పూర్తయ్యింది. చిన్నారిని ఆశీర్వదించడానికొచ్చిన కొందరు చిన్న నటులూ టెక్నీసియన్లూ నన్ను విష్ చేశారు. వారంతా తెలీకపోయినా చిరునవ్వుతో జవాబిచ్చాను.

రెండు మెతుకులు కెలికి ఇంటి కొచ్చి పడ్డాను.

ఆ రాత్రి కలత నిద్రే గతి అయ్యింది. నేను ప్రయాణిస్తున్న పడవ హఠాత్తుగా తుపానులో చిక్కుకున్నట్టూ, అది మహా సముద్రం మధ్యలో తిరగబడి పోయినట్టూ పీడకలలు!

ఆయన నాకూ పిల్లలకూ అన్యాయం చెయ్యరు కదా? గబుక్కున మెడలోని తాళిబొట్టుని కళ్ళకద్దుకున్నాను.

నిజమే. ఊర్వశి చాలా అందంగా ఉంటుంది. ఆయన తీసిన చాలా సినిమాల్లో కథానాయికగా చేసింది. కానిప్పుడు నలభయ్యోపడిలో పడింది. పెళ్లి కాలేదు. కుర్ర కథానాయికల్తో పోటీ పడలేక వెనకబడింది. బుక్కింగులూ తగ్గాయి... అంచేత ఆయన్ని వలలో వేసుకుని...!

ఆమె ఎన్ని వగలూ వయ్యారాలూ చూపినా ఆమె వలలో ఈయనెలా పడతారు? తాళి కట్టిన భార్యకీ కన్నబిడ్డలకీ ఎలా ద్రోహం చేస్తారు? పన్నీరు పైన చల్లు కోడానికేగాని తాగటానిక్కాదని ఆయనకు మాత్రం తెలీదూ!

ఏమో ఏం చెప్పగలం? మగబుద్ధి కుక్కతోక అంటారు...!

మనస్సు పరి పరి విధాలపోతోంటే క్షణ క్షణానికీ ధైర్యం సన్నగిల్లి పోతోంది!

నా కాపురం బుడగలా టప్‌మని పేలిపోదు కదా?!

మర్నాడు స్కూలు నుంచి పిల్లలు ఏడుస్తూ వచ్చారు. అనునయించాక వెక్కుతూ చెప్పారు. ఆయన ఊర్వశిని పెళ్లి చేసుకోబోతున్నారని టీచర్లు వీళ్ళెదుటే చెప్పుకున్నార్ట!

గుండెల్లో బాంబులు విస్ఫోటిస్తోంటే రాందాసుని పిలిచి నిలదీశాను.

"అవన్నీ గాసిప్స్ మేడమ్..." అని మొదట బుకాయించిన వాడే, చివరికి మరేమన్పించిందో గాని, "నాకూ భయంగానే ఉంది మేడమ్" అనేశాడు.

గూడు చెదరిన పక్షిలా  నిలువునా కంపించిపోయాను. అతడెళ్ళాక బావురుమని ఏడ్చాను.

దిక్కుతోచక అన్నయ్యలకీ బావకీ మావయ్యకీ స్నేహితులకీ అందరికీ ఫోన్ చేసి చెప్పాను. మాకు అన్యాయం చేస్తారేమోనని భయంగా ఉందన్న సంగతీ చెప్పాను. 'మేం ఉన్నాంగా. ధైర్యంగా ఉండు' అని హామీ ఇచ్చారంతా.

మరి వారానికి ఆయన టూర్ నుంచి వచ్చారు. వస్తూనే కడప బాంబు నా నెత్తిమీద నిర్ధాక్షిణ్యంగా వేసేశారు.

"నేను ఊర్వశిని పెళ్లి చేసుకుంటున్నాను. తను ఇక్కడే ఉంటుంది. మీరిక్కడుండడం తనకిష్టంలేదు"

నా రంగుల ప్రపంచం నా కళ్ళముందే కుప్పకూలిపోయింది. అమాంతం ఈ విశాల ప్రపంచంలో నేను ఒంటరి దాన్నన్న భావన చుట్టేసి కదిపి కుదిపేసింది. బావురుమన్నాను.

"ఏంటా ఏడుపులు ఎవరో పోయినట్టు!" అసహ్యంగా మొఖం పెట్టుకుని అన్నారు.

తమాయించుకుంటూ, "మమ్మల్నిలా నట్టేట ముంచుతారా?" ఆవేదనతో అడిగాను.

"నా చేతుల్లో ఏమీ లేదు"

"మేమెలా బతకాలి? ఎందుకు బతకాలి?" కన్నీళ్ళు చిప్పిల్లుతోంటే బేలగా అడిగాను.

"ఇక నీ దారి నీదే, నా దారి నాదే"

"నా దారేది?"

ఎవరో అపరిచితురాలడిగినట్టుగా చూసి జవాబివ్వకుండా వెళ్ళిపోయారు.

కూలబడిపోయాను. భయపడినంతా అయ్యింది. నాగుబాము కోరల్లో పది చుక్కల విషమే ఉంటుంది. ఈయన శరీరంలో పది టన్నుల విషం ఉంది. నా కాపురాన్ని కాటు వేసి...!

భోరుభోరున ఏడ్చాను.

భవిష్యత్తు అగమ్య గోచరంగా, అనంత అంధకార బంధురంగా కన్పిస్తూ భయపెడ్తోంది.

ఇప్పుడేది దారి? కింకర్తవ్యం ?

బంధువులొచ్చారు. ఆయన్తో మాట్లాడారు. నచ్చ చెప్పడానికి ప్రయత్నించారు. క్రిందా మీదా పడ్డారు. ఆయన లొంగిరాలేదు. వీరే సర్ది చెప్పుకున్నారు.

"మొత్తానికి నువ్వు అదృష్టవంతురాలివి" అన్నారు.

శుష్కహాసం చేశాను. "దీన్ని అదృష్టమంటారా?"

"అహ అది కాదు. నిన్ను ఎప్పట్లానే చూసుకుంటానన్నారు. ఉత్తుత్తి విడాకులు ఇస్తానన్నారు. నువ్వూ పిల్లలూ ఉండటానికీ జరుగుబాటుకీ ఏర్పాటు చేస్తానని ప్రామిస్ చేశారు. తుపాను వెలిసినట్టే గనుక నువ్వింక నిశ్చింతగా ఉండొచ్చు. ఆవిడ మీద మోజు తగ్గేక తనే నిన్ను వెదుక్కుంటూ వస్తాడు. ఇలాంటి వాళ్ళని ఎందర్ని చూడలేదూ! అంతదాకా కాస్త ఓపిక పడితే చాలు. నీకు భూదేవంత ఓర్పు, సహనం ఉన్నాయి గనుక ఇంకేం ఇబ్బంది ఉండదు"

నేను మాట్లాడలేదు. ఆలోచిస్తున్నాను. కాదు నాలో నేను మథన పడుతున్నాను. రగులుతున్నాను.

"అంతేనా?"

"ఆడదానికి అంతకంటే ఇంకేం కావాలి?"

నాకు 'దిక్కు' 'ఆర్థిక దన్ను' లేవనేగా వీళ్ళిలా మాట్లాడుతున్నారు. నన్ను బిచ్చగత్తెను చేస్తున్నారు?

నాకేదో మొండి ధైర్యం వచ్చేసింది.

"ఇది వరకు ఆయన లేకపోతే బతకలేననుకునే దాన్ని. ఇప్పుడాయన్తో కలిసి బతకడం కన్నా చావడం మేలన్పిస్తోంది. ఇక అతడి దయాదాక్షిణ్యాల మీదెలాబతగ్గలను?"

"ఆ పిచ్చి వాగుడేంటి. చిలక్కి పంజరంలో ఉన్నంత వరకే రక్షణ ఉంటుంది. తెలుసుకో"

"మెడ బట్టుకుని బయటికి గెంటేస్తోంటే ఇంకేం తెలుసుకోవాలి?"

"నీకు పిల్లలున్నారని మర్చిపోతున్నావ్..."

"ఆయన్లా నేను నా బాధ్యతల్ని దులిపేసుకోను. మీరేం బెంగ పెట్టుకోనక్కర్లేదు. ఇక చర్చ అనవసరం. మీరెళ్ళొచ్చు. మీరు చెప్పే ఆ భాగ్యం నా కొద్దు. ఇల్లాలి తనం పోయాక ఇంకేం దక్కితే నాకేంటి? నాకు గౌరవం కావాలి. నా ఉనికికి గుర్తింపు కావాలి. నాకు విలువ ఉండాలి. ప్రేమాభిమానాలు బంధాలూ అనుబంధాలూ కావాలి. అవేవీ లేనప్పుడు ఆయన దానిగా ఈ మూర్ఛబిళ్ళ మెడలో కట్టుకునెందుకు తిరగాలి?"

అదిరిపడ్డారంతా. నాకు పిచ్చెక్కిందన్నారు. చేజేతులా కాపురం కాలదన్నుతున్నానన్నారు. లోకంపోకడ తెలీని దాన్నన్నారు. గడపదాటితే కుక్కలు చింపిన విస్తరివవుతావంటూ శాపనార్థాలు పెట్టారు.

"ప్రయాణిస్తోన్న నౌక నడి సంద్రంలో ముక్కలయ్యిందని నిలువునా సముద్రంలో మునిగిపోం కదా? ఒక చెక్కనో దుంగనో పట్టుకుని ఒడ్డుకి చేరాలని, రెక్కల్లో శక్తీ ఒంట్లో ప్రాణం ఉన్నంత వరకూ తాపత్రయపడతాం కదా? నాదీ అలాంటి తపనే. తాపత్రయమే. ప్రయత్నమే!"

"నీ పేరున ఆస్తి లేదు. చేతిలో చిల్లి గవ్వలేదు. చదువు లేదు. ఉద్యోగం రాదు.

ఇంకెలా బతుకుతావ్? వాళ్ళనీ వీళ్ళనీ దేబిరిస్తూ ఏ పని మనిషిలానో పడుండేకన్నా ఇదే మంచిది. ఆలోచించు. ఓపికపడితే అతడు మారొచ్చుగా? నువ్వేదో ఘనకార్యం చేస్తున్నాననో సినిమాల్లోలా సాహసం చేస్తున్నాననో అనుకుంటున్నావు కాబోలు, అది సాహసం కాదు దుస్సాహసం. పెణం మీంచి పొయ్యిలోకి దూకుతున్నావంతే"

నేను తలొగ్గలేదు. తిట్టుకుంటూ వెళ్ళిపోయారు.

నావీ, పిల్లలవీ బట్టలు సర్దుకుని బయల్దేరబోతోంటే మేడమీంచి దిగి వచ్చారాయన. ఉండిపొమ్మని అర్థిస్తారనుకున్నాను. నా అంచనా తప్పయ్యింది. కరడు గట్టిన స్వార్థం ఎందుకు కరుగుతుంది?

"బయటికెళ్ళి నా మీద కేసుపెట్టి బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు గుంజాలనుకుంటున్నావేమో, నీ పప్పులు నా దగ్గర ఉడకవ్. ఈ కాగితం మీద సంతకం పెట్టేకే గుమ్మం దాటు"

"పెట్టను"

"సరే. వాళ్ళు నా పిల్లలు. నా దగ్గరే ఉంటారు. ఇహ నువ్వెళ్ళొచ్చు"

పిచ్చిగా చూశాను. మరుక్షణం సంతకం బరికి కాగితం అతడి మీదకు విసిరి పిల్లల్ని తీసుకుని బయటి కొచ్చేశాను.

సర్వం కోల్పోయినట్టు, జీవనయుద్ధంలో ఘోరంగా ఓడిపోయినట్టుగా ఉంది! కన్నీళ్ళాగటం లేదు!

అర్థరాత్రి తలుపు తట్టిన నన్ను చూసి నిర్ఘాంతబోయింది నా చిన్ననాటి మిత్రురాలు సౌభాగ్య.

నా పిల్లల వంక సానుభూతిగా చూస్తూ అంది. "వీళ్ళు చాలా చిన్నవాళ్ళు. ఈ వయస్సు నుంచే తండ్రి అవసరం ఎక్కువ ఉంటుంది. నువ్వు కొంచెం రాజీపడాల్సింది లహరీ..."

"ఆ గొడవ వదిలెయ్. మేం బతకడానికి గౌరవప్రదమైన మార్గం చూడు. డబ్బు లేదు. చదువూ లేదు. ఎస్సెస్సీ చదువుతూండగా కొంపలంటుకు పోయినట్టు చదువు మాన్పించి పెళ్ళి చేసేశారు. ఇన్నేళ్ళూ నేనేవిటో నా సంసారమేవిటో అన్నట్టు బతికాను. నాకు బయటి ప్రపంచం తెలీదు..."

"మరేం చేద్దామని, ఎలా బతుకుదామని?"

"తెలీదు. నేను బతకడం కాదు నా పిల్లలకి చక్కని జీవితం ఇవ్వాలి. ఉన్నత స్థాయికెదిగేందుకు మెట్లు పరచాలి..."

అయోమయంగా చూసింది.

ఆ చూపుల భావం గ్రహించాను. "నేనిప్పుడు బూడిదలా ఉన్నాను నిజమే. ఇందులోంచే ఫీనిక్స్ పక్షిలా లేచి రావాలి. విజయతీరానికి చేరుకోవాలి!"

"ఒంటి చేత్తో..."

"అవును. ఒంటరిగానే. ఇది సాధ్యమా అసాధ్యమా అని ఆలోచించను. సాధ్యం చేసి తీరాలన్నది నా కసి. పట్టుదల"

నా వంక అబ్బురంగా చూసింది. "నిన్ను చూస్తూంటే తప్పకుండా విజేతవవుతావన్పిస్తోంది. ఏం చెప్పగలం. ఎందరికో స్ఫూర్తివీ అవుతావేమో!"

"నువ్వే నా భరోసా" ఆమె చేయి నొక్కుతూ మిత్రురాలి వంక ఆశగా చూశాను.

సౌభాగ్య సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఎక్కువగా ఇంటి నుంచే ఆఫీసు పని చేస్తూంటుంది. ఆమె భర్తని ఈ మధ్యే అతడి కంపెనీ వారు అమెరికా పంపించారు. ఆర్నెల్ల దాకా రాడు. వారికి ఒక్కతే అమ్మాయి. ఇద్దరూ ఉద్యోగస్తులవడంతో హాస్టల్లో ఉంచి చదివిస్తున్నారు.

అంచేత మేం తనింట్లో ఉన్నా తనకేం ఇబ్బందిగా లేదు. కాని మాకే ఏదోలా ఉంది. ఎన్నాళ్ళని ఒకరి మీద ఆధారపడి ఉండటం?

"ఏదొక పని చేయాలి. ఇల్లు చూసుకోవాలి. పిల్లల్ని దగ్గర్లోని ఏదో స్కూల్లో చేర్పించాలి. ఇది వరకు చదివిన ఇంటర్నేషనల్ స్కూల్లో చదివించడం ఇప్పుడు నా శక్తికి మించిన పని. అలా అని వారిని వానాకాలం చదువు చదివించను. తండ్రి దగ్గరుంటే ఎలాంటి స్థితికి వెళ్ళగలిగే వారో దాన్ని మించిన స్థాయికి చేర్చాలి! మంచి మనుషులుగా తీర్చిదిద్దాలి. అప్పుడే నేనూ నా లైఫ్ సక్సెస్ అయినట్టు!"

"ఆల్ ది బెస్ట్"

కాని ఆ ఆవేశం ఆ ధైర్యం ఆ ఆత్మవిశ్వాసం రోజురోజుకీ సన్న గిల్ల సాగాయి.

"నేను తప్పు చేశానంటావా? నా బిడ్డల భవిష్యత్తు ఫణంగా పెట్టానంటావా!" నాలోని ఏదో అపరాధ భావన అడిగింది.

"ముమ్మాటికీ కాదు. నువ్వింత దాకా కంఫర్ట్ జోన్‌లో ఉన్నావు. ఎలాంటి కష్ట నష్టాలొచ్చి మీద పడినా ఆడవాళ్ళు అందులోనే సర్దుకుపోతుంటారు తప్ప అందులోంచి బయటికి రావడానికి సాహసించరు. కాని దిగజారిన పరిస్థితుల్తో సర్దుకుపోలేక అందులోంచి బయటి కొచ్చావు. అది పెద్ద సాహసమే కాని నీకింకో దారి లేదు. అంచేత ఉన్న పరిస్థితుల్ని అవకాశాల్ని అనుకూలంగా మలచుకోవాలి. ఆత్మవిశ్వాసంతో ముందడుగువేస్తే ఎవరూ సాధించలేనిదంటూ ఉండదు. కాని ఎట్టిపరిస్థితిలోనూ నీధైర్యం సడలనివ్వొద్దు!"

"థాంక్యూ..." ధృఢచిత్తంతో తలపంకిస్తూ అన్నాను.

"మనమంతా శక్తి వంతులమే లహరీ. మనలో మనకి తెలీని ఎన్నో శక్తులున్నాయి. అవి ఉన్నట్టు మనకే తెలీదు. కొన్ని కొన్ని పరిస్థితుల్లో అనుకోకుండా అవి బయటపడతాయి. మనం చేయాల్సిందల్లా వాటిని ఒడుపుగా పట్టుకుని పదును పెట్టడమే. అప్పుడిహ విజయం నీదే, కీర్తి నీదే, కిరీటమూ నీదే"

చప్పున బుడగల కిరీటం గుర్తొచ్చింది. "బుడగల బిజినెస్ ప్రారంభిస్తే?"

వెర్రిదాన్ని చూసినట్టు చూసింది. "తిరునాళ్ళలోనూ బజార్లలోనూ నిలబడి బెలూన్స్

అమ్ముతావా? మతి ఉండే మాట్లాడుతున్నావా?"

"అహహ. అలా కాదే. బర్త్ డే పార్టీల్లో బుడగలతో డెకరేట్ చేస్తున్నారుగా. దాన్ని మరింత డెవలప్ చేస్తాను. కొత్త కొత్త థీమ్స్‌తో కొత్త రకాల షేపుల్తో బెలూన్స్ తయారు చేసి, అన్ని రకాల ఫంక్షన్లలోనూ డెకరేట్ చేస్తాను. మెల్లగా పెళ్ళిళ్ళకీ సీమంతానికీ ఎంగేజ్‌మెంటుకీ షష్టిపూర్తికీ అన్ని ఈవెంట్లకీ చేస్తాను..." ఉత్సాహతరంగమై చెప్పుకుపోయాను.

నా వంక గుడ్లప్పగించి చూసింది.

"యస్. నువ్వు చెయ్యగలవని నీ కళ్ళల్లోని మెరుపులే చెబుతున్నాయి. లెటజ్ ట్రై..."

నన్ను తన ప్రక్కన కూర్చోబెట్టుకుని ఇంటర్నెట్లో సెర్చి చేసింది. ఎన్నో వందల వేల రకాల బెలూన్లనీ, వాటితో వినూత్నంగా చేసిన ఆకృతుల్నీ చూపించింది.

బెలూన్లు తయారు చేసే మెషీన్ల గురించి వివరాలు సేకరించాం. అమెరికా నుంచి దిగుమతి చేసుకొంటే అన్ని ఖర్చుల్తో టాక్సుల్తో కలిపి లక్ష అవుతుంది.

"మెషీన్‌కే లక్ష అయితే మిగతా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కీ, ప్రచారానికీ, దానికీ చాలా డబ్బు కావాలి..."

"నా దగ్గర మా పుట్టింటి వాళ్ళు పెట్టిన నగలున్నాయి. వాటిని అమ్మేస్తాను"

"బెలూన్స్ మీద అంత పెట్టుబడి పెట్టి బిజినెస్ స్టార్ట్ చెయ్యడం... తొందర పాటు అన్పిస్తోంది లహరీ"

"ఏం కాదు సౌభాగ్యా. నాకు ఆసక్తి ఉంది. బయట అవకాశాలున్నాయి. ఈవెంట్ మేనేజర్లనీ తద్వారా కస్టమర్లనీ మెప్పించగల నన్న నమ్మకం ఉంది. సిటీలో అంతా ఎక్కువగా బెంగళూరు పూలతో డెకరేట్ చేస్తున్నారు. దానితో పోలిస్తే ఇది ఖరీదు బాగా తక్కువ. పైగా వెరైటీ అవుతుంది గనుక అందర్నీ ఆకర్షిస్తుంది. అదీ గాక నాకిష్టమైన బుడగల్తో పని. ఇంతకంటే మేలైనది చేయలేనేమో కూడా!"

"ఓకే ఓకే. నా సేవింగ్స్‌లోంచి యాభై అరవై వేలు సర్దుతాన్లే..."

"దేవుడు నీ రూపంలో వచ్చి మాకు చేయూత నిస్తున్నాడు. థాంక్యూ... థాంక్ గాడ్" పరమానందపడిపోయాను.

నా దినచర్య పూర్తిగా మారిపోయింది. పిల్లల్ని దగ్గర్లోనే ఉన్న స్కూలుకు పంపి రకరకాల బెలూన్లని ముందేసుకుని కూర్చుంటున్నాను.

ట్విస్టర్ బుడగల్ని చేత్తో తిప్పి రకరకాల ఆకృతుల్లోకి తీసుకురావడానికి సాధన చెయ్యడమే నా పని. నెట్లో చూసిన ఎన్నో రకాలు చేస్తూ వాటికి నా ఆలోచననీ అభిరుచినీ జోడించి వినూత్న థీమ్స్ తయారు చేస్తున్నాను. సౌభాగ్య సూచన మేరకు వాటన్నిట్నీ ఎప్పటికప్పుడు ఒక పుస్తకంలో నోట్ చేస్తున్నాను.

బెలూన్ల వ్యాపారం గురించి బంధువులకి తెలిసింది. "పెద్ద ప్రొడ్యూసర్ భార్య గాలి

బుడగలమ్ముతుందన్న మాట. బావుంది. రోజుకో వంద సంపాదించక పోదులే" అని వంకరగా నవ్వేరు.

"బుడగల్తో మేడలు కట్టేస్తుంది కాబోలు!" అని వెక్కిరించారు.

సాయపడటానికి చేతులు రావుగాని వెక్కిరించడానికీ వెనక్కిలాగటానికీ కొందరికి మనస్సు వస్తుంది!

అమెరికా నుంచి మెషీన్ వచ్చింది. దాన్ని ఆప్యాయంగా నిమిరి పొంగిపోయాను. దాన్నెలా ఆపరేట్ చెయ్యాలో మాన్యువల్ చదివి చెప్పింది సౌభాగ్య.

దగ్గర్లోనే ఉన్న ఎపార్ట్‌మెంట్స్ సముదాయపు సెల్లార్‌లో ఓ రూం అద్దెకు తీసుకుని అందులో మెషీన్ని అమర్చాం. ఒక వర్కర్‌ని పెట్టుకున్నాను. ఇద్దరం రకరకాలుగా తంటాలు పడి వివిధ ఆకృతుల్లో బెలూన్లు తయారు చేయడం నేర్చుకున్నాం.

ఆ వెంటనే మార్కెటింగ్ మీద పడ్డాను.

ప్రముఖ హెూటళ్ళకీ ఫంక్షన్ హాళ్ళకీ వెళ్ళి నా విజిటింగ్ కార్డు ఇచ్చాను. వారి ద్వారా ఆర్డర్ వస్తే వారికి 10% కమీషన్ ఇస్తానని చెప్పాను.

వినాయక చవితి ఉత్సవాలు మొదలయ్యాయి. నాలుగు పెద్ద మంటపాలను సెలక్ట్ చేసుకుని ఉచితంగా బుడగలతో అలంకరిస్తానని చెప్పాను. అయిదు రోజుల వరకూ పేలవని హామీ ఇచ్చేసరికి వారు సంతోషంగా ఒప్పుకున్నారు.

ఓ హెూటల్ వారి ద్వారా బర్త్‌డే డెకరేషన్‌కి మొదటి అవకాశమొచ్చింది. మా శాయశక్తులా ప్రయత్నించి సరికొత్త రీతిలో అలంకరించి అభినందనలందుకున్నాం. నా ఆత్మవిశ్వాసం రెట్టింపయ్యింది.

మేం తయారు చేసిన విభిన్న ఆకృతుల్నీ, బర్త్‌డే డెకరేషన్, వినాయక మంటపాల డెకరేషన్‌లనూ ఫొటోలు తీసి ఫేస్‌బుక్‌లోనూ వాట్సాప్‌లోనూ పెట్టింది సౌభాగ్య.

ఎన్నో ఎంక్వైరీలూ కొన్ని ఆర్డర్లూ వచ్చి పడ్డాయి.

మరిన్ని థీముల్తో మరింత కొత్తగా అలంకరించాం. మా శ్రద్ధలో అంకితభావంలో ఎలాంటి లోటూ అలసత్వం రానివ్వలేదు.

పెద్ద షాపులోకి వ్యాపారాన్ని మార్చాం. వేరే ఎపార్ట్‌మెంటు అద్దెకు తీసుకుని అందులోకి మేం మారాం. సౌభాగ్య అప్పు తీర్చేశాం. నెలకు ఇరవై ఈవెంట్ల స్థాయి కెదిగాం. మరో ఇద్దరు వర్కర్లను పెట్టుకున్నాను.

చూస్తూండగానే నెలకి అన్ని ఖర్చులూ పోను యాభై అరవై వేలు మిగిలే స్థాయికి చేరుకున్నానంటే నమ్మశక్యంగావట్లేదు.

పెద్దగా చదువుకోని నేను, ఆర్థిక వనరులూ బలగమూ లేని నేను, ఒంటి చేత్తో ఈ స్థితికి వచ్చానంటే ఇది కలో నిజమో తెలీట్లేదు. ఈ ప్రపంచం ఎన్నో కలల్నే కాదు మరెన్నో అవకాశాల్నీ ఇస్తోంది సుమా!

"ఇది నీ సాహసానికి నీ పట్టుదలకి ప్రతిఫలం. జనానికి ఏది కావాలో అది ఉన్నత స్థాయిలో అందించగలిగితే చాలు విజయం స్వంతమై తీరుతుందని ఋజువు చేశావు. హేట్సాఫ్" అంది సౌభాగ్య.

"నన్ను మునగ చెట్టు ఎక్కిస్తున్నావ్" నవ్వేను.

"నీ ప్రతిభని స్ఫూర్తిదాయకతని అభినందిస్తున్నాను. ఏదో జరక్కూడనిది జరిగిందని నిరాశతో కృంగిపోయేవారూ, నిస్పృహతో ఆత్మహత్య చేసుకోవాలనుకునేవారూ నిన్ను ఆదర్శంగా తీసుకోవాలి"

నా ఫోన్ మ్రోగింది. ప్రముఖ యువనటుడు అభయ్‌రామ్ ఇంట్లోని ఫంక్షన్‌కి డెకరేట్ చెయ్యాలనీ వెంటనే ఆల్బమ్‌తో వచ్చి కలవమనీ చెప్పారు.

"నక్కని తొక్కావ్. ఈ దెబ్బకి ఎక్కడికో వెళ్ళిపోవడం ఖాయం. కంగ్రాట్స్ లహరీ"

"ఇదంతా నీ చలవేనే. నువ్వు నీరు పోయకపోయి ఉంటే నేనివాళిలా నా కాళ్ళ మీద నేను నిలబడి ఉండేదాన్నే కాదు" మనస్ఫూర్తిగా అన్నాను.

అభయ్ రామ్‌తోనూ మా వారు – సారీ వాలేశ్వర్రావు ఒక సినిమా తీశారు. మా సినిమాల ప్రారంభోత్సవ పూజలన్నిటికీ నేను వెళ్ళేదాన్ని. అంచేత అతడు నన్ను గుర్తు పడతాడేమో, ఏమంటాడో ఏమో, ఆర్డర్ ఇస్తాడో లేదోననుకుంటూ కించిత్తు ఉద్విగ్నంగా ఫీలవుతూనే ఒక అసిస్టెంటుని తీసుకుని అతడింటి కెళ్ళాను.

సోఫాల్లో కూర్చుని కూల్డ్రింక్ త్రాగుతోంటే అతడొచ్చాడు "మీరేనా బెలూన్ డిజైనర్?" అంటూ.

లేచి తలూపుతూ నమస్కరించాను. అతడు గుర్తు పట్టలేదు. అపరిచితురాలిని అనుకునుంటాడు. నిజమే. నేనిప్పుడు ముమ్మాటికీ కొత్త మనిషినే. ఈ జీవనసంగ్రామంలో ఎలాగైనా గెలవాలని సర్వాయుధాలూ ధరించి ఒంటరిగా పోరాడుతున్నాను.

"మీ గురించి మా మిస్సెస్ చెప్పింది. ఫేస్‌బుక్‌లో చూసిందట..."

మాటల్లోనే చిర్నవ్వులు చిందిస్తూ వచ్చిందతడి భార్య. నిండు గర్భంతో ఉంది. ఈవెంట్ అర్థమైంది. ఇది కుదిర్తే మాకు ఇదే మొదటి సీమంతం ఫంక్షన్ అవుతుంది.

"ఇది వరకు సీమంతం ఫంక్షన్లకేమైనా చేశారా?"

"చేస్తాను. మీకెలా కావాలో చెప్పండి చాలు..."

"మీ స్పెషల్ డిజైన్స్ చూపించండి..." అందతడి భార్య అతడి ప్రక్కకొచ్చి కూర్చుంటూ.

"అదిరిపోవాలి. దట్సాల్..." అన్నాడు అభయ్‌రామ్.

విభిన్న స్వాగత ద్వారాలు, ఫౌంటెన్లు, హంసలదీవి, బార్బీ ప్రిన్సెస్, బాలకృష్ణుడు, చోటా భీమ్, కృష్ణ బలరామ్, ఎలీస్ వండర్ ల్యాండ్, రెయిన్ బో డిజైన్, విదేశీ డిజైన్స్ – అన్నిటి ఫోటోలూ ల్యాప్‌ట్యాప్‌లో చూపించాను.

"గుడ్. అన్నీ బావున్నాయ్. కానింతకు ముందు ఎక్కడా చేయని థీమ్‌తో చెయ్యండి.

మీ ప్రతిభ తెలుస్తోంది. మీ మీద నమ్మకముంది. అదిరిపోవాలి... ఇదిగో ఎడ్వాన్స్..."

నోట్ల కట్ట ఇచ్చాడు. ఎంత ఏమిటన్న బేరాల్లేవ్. ఒక కళాకారుడి సృష్టి విలువ మరో కళాకారుడికే తెలుస్తుందేమో!

"మీ బిడ్డ సైతం గర్వపడేలా డెకరేట్ చేస్తాను"

మరి నాలుగు రోజుల వరకూ రకరకాల డిజైన్లు చెప్పి కంప్యూటర్ మీద గీయించాను. అవుట్ పుట్ చూసి మరిన్ని సజెషన్స్ ఇస్తూ మరింత సుందరంగా తీర్చి దిద్దాను.

అందరం సంతృప్తి పడ్డాక దాన్ని యథాతథంగా సీమంతం రోజున దించేశాం.

ఆహుతులందరూ ప్రముఖులే. సినీ గ్లామర్ ఫీల్డ్ వారే. ఎన్నో దేశ విదేశాల్లో ఎన్నో ఈవెంట్స్ చూసిన వారే.

అయినా అంతా మయసభలో ప్రవేశించినట్టుగా తన్మయులయ్యారు. డిజైనర్ ఎవరూ అంటూ అడిగి మరీ వచ్చి నన్ను అభినందనలతో ముంచెత్తారు.

"యూ డిడిట్. అదిరిపోయింది" మెచ్చుకున్నాడు అభయ్‌రామ్.

మా పిల్లలు బాలూ, నీలూ అతడ్తో కలిసి ఫొటోలు దిగారు.

"మీ డాడీ ఏం చేస్తుంటారు" అడిగాడతడు.

"డాడీనే అడగండి" అంటూ నా వంక గర్వంగా చూపించారు.

"అతడికర్థమైపోయింది. సింగిల్ మదరన్న మాట. గ్రేట్" అన్నాడు.

"డేకరేషన్ ఎక్సలెంట్. ఏ కంట్రీలోనూ చూడలేదు. ఎక్కడ్నుంచి పిలిపించావ్ రామ్..." అంటూ వచ్చింది ఊర్వశి.

నన్ను పరిచయం చేశాడు అభయ్‌రామ్. చిత్రం. ఆమె సైతం నన్ను గుర్తు పట్టలేదు.

"కంగ్రాట్స్. లోకల్‌లో ఇంత టాలెంటుందా. గ్రేట్. మా వెడ్డింగ్ యాన్నివర్సరీ ఫంక్షన్‌కి మీరే డిజైన్ చేయాలి..."

"ఎవర్తో మాట్లాడుతున్నావ్ డార్లింగ్" అంటూ వచ్చాడు నా మాజీ భర్త వాలేశ్వర్రావు.

నన్ను చూసి గతుక్కుమన్నాడు.

"మీట్ దిస్ ఫెంటాస్టిక్ లేడీ. ఈ డెకరేషనంతా చేసింది ఈమేనట. మన ఫంక్షన్‌కీ చెయ్యమంటున్నాను..." నా వైపు తిరిగి అంది "చేస్తారు కదూ?"

"ఇది నా వృత్తి. తప్పకుండా చేస్తాను..." విజయహాసం నా పెదాల మీద చిందులేస్తోంటే నిలువెత్తు ఆత్మ విశ్వాసంలా జవాబిచ్చాను.

* * *

**(నోముల పురస్కార బహుమతి కథలు–2016)**